

# సంసారంలో సరిగమలు - తమస్విని



*(ప్రతి సంసారంలోనూ వినిపించే రాగాలు..*

*కొన్ని సరదాలు, కొన్ని సరాగాలు,*

*కొన్ని సరసాలు, ఇంకొన్ని విరసాలు, మరికొన్ని విషాద గీతాలు..*

*వెరసి సంసారంలో సరిగమలు..!)*

## ఇంత తెలివి యుండి...

**"హల్లో వరం!** చాలా రోజుల తర్వాత కనిపించావే? అంతా కులాసానేనా?" వెనకనుంచి ఆమె భుజం మీద చెయ్యి వేసి అడిగాడు కనకారావు.

బిత్తరపోయిన వరలక్ష్మి ఆ చేతిని విదిలించికొట్టి, లేచి నుంచుని పైటని భుజాలమీదుగా కప్పుకుంది. గిరిజాంబ కళ్ళల్లోంచి నిప్పులు రాలాయి.

"వస్తా పిన్నిగారు. అమ్మ వీలైతే మిమ్మల్ని సాయంత్రం ఓసారి రమ్మంది"

`బొట్టు పెడతా ఉండమ`ని గిరిజాంబ పిలుస్తున్నా వినకుండా వడివడిగా వెళ్ళిపోయింది వరలక్ష్మి.

"మీకసలు బుద్ధుందా?" భర్తని గద్దించింది గిరిజాంబ.

"నేనేం చేసాను?" వరలక్ష్మి కూర్చున్న చోట కూర్చుంటూ అడిగాడు కనకారావు అమాయకంగా.

"ఏం చేసారా? ఆ పిల్ల మన కూతురులాంటిది. దాని భుజం మీద చేతులు వేసి మరీ కుశల ప్రశ్నలు అడగాలా?"

"అందులో అపార్థం చేసుకోడానికి ఏముంది? తండ్రిలాంటి వాడినని ఊరుకోవచ్చుగా?"

"ఛీ!"

గిరిజాంబ ఆ గదిలోంచి లోపలికి వెళ్ళిపోయింది. ఈ మధ్య కనకారావు ప్రవర్తన ఆమెకి జుగుప్సగా, సిగ్గుగా ఉంటోంది. ఉద్యోగంలో ఉన్నంతకాలం ఆయన చాలా హుందాగా అడిగినవాటికి మటుకే బదులిస్తూ గౌరవప్రదంగా ఉన్నాడు. రిటైరయ్యాక తోచక భార్యతో ముచ్చట్లు, వంటలో వంకలు పెట్టడాలులాంటివి చేసేవాడు. పదేళ్ళ రిటైర్మెంట్ జీవితం తర్వాత డెబ్బై ఏళ్ళు దాటిన ఆయన మనస్తత్వం విచిత్రంగా మారిపోయింది. పదహారేళ్ళ కుర్రాడికంటే కనాకష్టంగా తయారయ్యాడు. కొత్తగా హెయిర్ డై, మీసాలకి రంగు మొదలు పెట్టాడు.

ఇదివరకు గిరిజాంబ కోసం ఎవరైనా ఆడవాళ్ళు వస్తే లోపలికి వెళ్ళిపోయేవాడు. ఇప్పుడలాకాదు. వాళ్ళతో కూర్చుని కబుర్లు చెపుతున్నాడు. ఆ కబుర్లు ఆ అమ్మలక్కలకి ఇబ్బందిగా ఉండేవి. అంతేగాక, ఆయన అవసరం లేకపోయినా తాకుతున్నాడని గ్రహించగానే గిరిజాంబ ఇంటిమీద ఆడకాకి కూడా వాలడం మానేసింది. భర్త ప్రవర్తనకి సంజాయిషీ చెప్పుకోలేక ఆవిడ బయటకి రావడం మానేసింది.

మధ్యాహ్నాలు స్నేహితురాళ్ళతో కబుర్లు చెప్పుకుంటూ కాలక్షేపం చేసే గిరిజాంబకి ఏకాకి జీవితం దుర్భరంగా ఉంది. చాలారోజుల తర్వాత పుట్టింటికి వచ్చిన పక్కింటామె కూతురు వరలక్ష్మి 'బాగున్నారా ఆంటీ' అని వస్తే ఆమెకి ప్రాణం లేచొచ్చినట్లయింది. ఉభయకుశలోపరి పూర్తయ్యేలోగానే కనకారావు రావడం, వరలక్ష్మి భుజం మీద చేతిని వేయడం, ఆమె పారిపోవడం జరిగిపోయాయి.

"ఇది వరకు మీరు ఎంత హుందాగా, పెద్దమనిషి తరహాగా ఉండేవాళ్ళండీ. ఇప్పుడేమిటి ఖర్మ. ఇలా మారిపోయారు?" భోజనం వడ్డిస్తూ ఆవిడ అనునయంగా అడిగింది.

"నేనేం మారలేదు. మీరే మారిపోయారు. వరలక్ష్మి మనింట్లో ఆడుకున్న పిల్ల. నన్ను చూసి పారిపోవడమేంటి? నీ ఫ్రెండ్స్ ముందే బాగా భయపెట్టి ఉంటారు... సాంబార్‌లో ములక్కాయి ఇంకాస్త ఉడకాలి" తలెత్తకుండా చెప్పాడు కనకారావు.

"ఆడపుట్టక పుట్టాక ఎవరు ఏ వంకతో మీద చేతులు వేస్తారో ఆ మాత్రం తెలియదా? అసలు ముట్టుకుని మాట్లాడే అవసరం ఏమిటి?" గద్దించింది.

ఆయన చెయ్యి కడుక్కుని ఆ తడి చేత్తో ఆవిడ బుగ్గమీద చిటికె వేసి మరో చేత్తో మీసాలు మెలిపెట్టాడు.

గిరిజాంబ ఓ నిట్టూర్పు విడిచి వంటగది సర్ది హాల్లోకి వచ్చింది.

కనకారావు సోఫాలో విలాసంగా పడుకుని ఫాషన్ టి.విలో కేట్ వాక్ చేసే అమ్మాయిలని నోరు తెరుచుకుని చూస్తున్నాడు.

"నిద్రరావటం లేదూ?" అది గమనించనట్లుగా అడిగింది.

"లేదు. పక్కన నువ్వు ముసలి వాసన వేస్తున్నావు." ఆరోపణగా చెప్పాడు.

"మీరు నాకంటే మూడేళ్ళు పెద్ద."

"కానీ నేను యంగ్ ఎట్ హార్ట్. నీకంటే పదేళ్ళు చిన్నవాడిలా కనపడతా తెలుసా? మనిద్దరం బయటికి వెళితే 'మీ అమ్మా?' అంటారు" గర్వంగా చెప్పాడు.

"సరే నేను వెళ్ళిపడుకుంటా రేపు అబ్బాయి కోడలు వస్తున్నారు. దయచేసి వాళ్ళున్న రెండు మూడు రోజులు కొంచెం జాగ్రత్తగా ఉండండి. మీ నోటినీ, చేతులని కంట్రోల్‌లో ఉంచుకోండి." అభ్యర్ధన, ఆజ్ఞ మేళవించి చెప్పింది గిరిజాంబ.

కొడుకు, అతను ప్రేమించి పెళ్ళిచేసుకున్న బెంగాలి పిల్ల రావడంతో గిరిజాంబకి పని ఎక్కువైంది. తెలుగురాని కోడలు దూరం దూరంగానే మసలుతోంది.

"నాన్నేమిటమ్మా ఇలా తయారయ్యారు?" కొడుకు వంటింట్లోకి వచ్చి, తల్లి తరుగుతున్న దోసకాయ ముక్కలు రెండు తీసుకుని తింటూ అడిగాడు.

"ఏం చేస్తారా?" గుండె దడదడలాడుతూండగా ప్రశ్నించింది.

"నీ టీ షర్ట్‌లు బావున్నాయిరా వెళ్ళేప్పుడు నాకిచ్చి వెళ్ళి నువ్వు మళ్ళీ కొనుక్కో అన్నారు. ఈ వయసులో మీకు టీ షర్ట్స్ ఏం బావుంటాయి నాన్నా అంటే ఐయాం జస్ట్ ఫిఫ్టీ అంటున్నారు" నవ్వాడు.

"హు! ఉద్యోగం చేసినంతకాలం పాపం ఇవేం పట్టించుకోలేదురా. ఇప్పుడు మీ నాన్నకి పునర్ యవ్వనం వచ్చింది." తనూ నవ్వుతూ చెప్పింది గిరిజాంబ.

"అదేకదా! నాకే రెండేళ్ళలో ఏభై వస్తాయినాన్నా అని చెప్పా. 'నిజం చెప్పాలంటే నేను ముప్పైలో ఆగిపోయారా అన్నారు"

"పోనీ ఓ రెండు చొక్కాలు ఇచ్చి వెళ్ళరా" అభ్యర్ధించింది.

"అయ్యో అమ్మా! దానికేం ప్రాబ్లం లేదు. కానీ నిన్న రీనా దగ్గరకి వెళ్ళి బెంగాల్ వాళ్ళు పేదవాళ్ళు కదా. ముప్పై నలభై ఏళ్ళ అందమైన వితంతువు ఎవరైనా వచ్చి మనింట్లో పనిచేస్తూ ఉండిపోతుందా అని ఇంగ్లీష్‌లో అడిగారుట. పెళ్ళి కాకపోయినా ప్రాబ్లం లేదుట. క్రితంసారి వచ్చినప్పుడు మామగారు అత్తగారికి దుబాసీగా మాత్రమే మాట్లాడారు. ఇప్పుడు కల్పించుకుని మాట్లాడుతున్నారు అంటోంది" గిరిజాంబకి ఏం చెప్పాలో అర్థం కాలేదు. కానీ చెప్పక తప్పదు.

"నాన్న ఈ మధ్య చాలా మారారురా.." మొత్తం వివరించేసరికి ఆవిడకి దుఃఖం వచ్చింది.

"ఇదేదో సైకలాజికల్ ప్రాబ్లం అమ్మా. నా ఫ్రెండ్ చందు తెలుసుగా! తను సైకియాట్రీలో డాక్టరేగా? ఓసారి నిన్ను కలవమని చెప్తాలే" ఓదార్చాడు.

కొడుకు గది బయట కుర్చీ వేసుకుని పేపర్ చదువుకుంటున్నాడు కనకారావు. తలుపు తీసుకుని ముందు కొడుకు, తర్వాత కోడలు బయటకి వచ్చారు. వారి మొహాల్లోకి తేరిపారచూస్తూ అడిగాడు కనకారావు.

"రాత్రి సాంస్కృతిక కార్యక్రమం బాగా జరిగిందా?"

వంటగదిలోని గిరిజాంబ ఆ ప్రశ్నకి గతుక్కుమంది కొడుక్కి ముందు రోజే విషయమంతా చెప్పి మంచి పని చేసిందనుకుంది.

తండ్రి ప్రశ్న వెంటనే అర్థం కాలేదు కొడుక్కి. అర్థమయ్యాక కంగారుగా భార్య వంక చూసాడు. తెలుగు అర్థంకాని ఆమె మామగారికి విష్ చేసి అత్తగారి దగ్గరకి వెళ్ళింది.

"ఏరా జవాబు చెప్పవే?" పేపర్ ముడిచి విలాసంగా ప్రశ్నించాడు కనకారావు.

వెళ్ళబోయే ముందు స్నేహితురాలికి ఫోన్ చేసి తల్లిని కలవమని మరీ మరీ చెప్పి రైలెక్కాడు కొడుకు.

గిరిజాంబ చెప్పిందంతా సానుభూతిగా విన్న చందన ఓ నిట్టూర్పు విడిచి చెప్పింది.

"సారీ ఆంటీ ఇది ఖచ్చితంగా మానసిక జబ్బే. కానీ మందు లేని జబ్బు. కొంతమందికి అరవైదాటాక తను జీవితాన్ని సంతృప్తికరంగా అనుభవించలేదేమో అనే అనుమానం వస్తుంది. మిగిలిన కొద్దిపాటి జీవితాన్ని సద్వినియోగం చేసుకోవాలనుకుంటారు. గడిచిపోయిన యవ్వనాన్ని తిరిగి తీసుకురాలేరు కాబట్టి చేతులు, మాటలతో తృప్తి పడదామనుకుంటారు. వయసుని అడ్డుపెట్టుకుని ఆడవాళ్ళని తాకడం బూతు డైలాగ్స్ చెప్పడం చేస్తారు. అంకుల్ కూడా ఈ వ్యాధి పీడితుడే మా ప్రొఫెసర్ చెప్పేవారు. చిన్న పిల్లలని ఇరవై పాతికేళ్ళలోపు వారి దగ్గర వంటరిగా వదిలి పెట్టొచ్చు కానీ డెబ్బైదాటిన వాళ్ళ దగ్గర వదలకూడదట."

"మందులు కనిపెట్టకపోతే ఎలా చందనా? బయటకి వెళ్ళారంటే ఇంటికి వచ్చేదాకా భయమే. ఎవరిని ఏ కామెంట్ చేసి తన్నులు తింటున్నారో అని." గిరిజాంబ దుఃఖంగా చెప్పింది.

"హాయ్ చందనా! ఎలా ఉన్నావ్? రోజు రోజుకీ చిన్న పిల్లవవుతున్నావే?" ఆమె చేతులు పట్టుకుని నిమురుతూ అడిగాడు బయటినించి వచ్చిన కనకారావు.

ఇక దేవుడే దిక్కు అన్నట్లుగా ఆకాశంలోకి చూసి చేతులు జోడించింది గిరిజాంబ.

***(వచ్చే సంచికలో మరో సరిగమ)***

Click here to share your comments on this story